క్లుప్తంగా

రహదారి తొలగింపు



చెరువు మధ్యలో వేసిన రహదారిని జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

విజయనగరం టౌన్: పట్టణంలోని కణపాక మహంతి చెరువులో వేసిన రహదారిని మున్సిపల్ అధికారులు శనివారం తొలగించారు. చెరువు మధ్యలో రహదారి వేశారని ఫిర్యాదులు రావడంతో కమిషనర్ నల్లనయ్య స్పందించారు. పట్టణ ప్రణాళిక, రెవెన్యూ అధికారులతో కలిసి వెళ్లి రహదారిని తొలగించారు. మిగిలిన పనులను ఆదివారం చేపడతామని చెప్పారు.

బాబూరావు సేవలు అమోఘం



బాబూరావు దంపతులను సత్కరిస్తున్న డీఎఫ్‌ఓ వెంకటేష్

విజయనగరం పూల్‌బాగ్: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా బాబూరావు అందించిన సేవలు అమోఘమని జిల్లా అటవీ అధికారి ఎస్.వెంకటేష్ కొనియాడారు. ఎస్. గున్నల (తామరాపల్లి)ఎఫ్‌బీఓ ఎస్ బాబూరావు శనివారం ఉద్యోగ విరమణ చేయడంతో స్థానిక పూల్‌బాగ్‌లోని అటవీ శాఖ కార్యాలయంలో సన్మానసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి. అప్పలరాజు, ఎస్ఎస్ఓ కేవీఎస్ రాజు, ఎఫ్‌బీఓలు రామారావు, శ్రీను, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిభట్లకు నివాళులు



ఆదిభట్ల విగ్రహానికి పూలమాల వేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి, తదితరులు

విజయనగరం టౌన్: మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల తొలి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆదిభట్ల నారాయణదాసుకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు శనివారం నివాళులర్పించారు. ఆదిభట్ల జయంతిని పురస్కరించుకుని కళాశాల ఆవరణలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాస్త్రి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెంచూరియన్ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థినులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో సఖీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎదిగే వయసులోనే విద్యార్థులు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. నిత్యం యోగా, శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, యూనిసెఫ్ ప్రతినిధి శ్రీలత, సీఎస్ఆర్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రావణి, నేచర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

61 మంది విద్యార్థులకు వ్యాక్సిన్లు



విద్యార్థికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని పేర్లవారివీధిల గల ఎస్ఎంఆర్‌పీసీ చెవిటి పిల్లల పాఠశాల ఆవరణంలో సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ ఆఫ్ ది డఫ్ అండ్ బ్లైండ్ సంస్థ ఆధ్వర్యంలో 61 మంది విద్యార్థులకు సర్వైకల్ కాన్సర్ రాకుండా వ్యాక్సిన్లు వేశారు. మానవసేవా ట్రస్ట్ (యూఎస్ఏ) సహకారంతో శనివారం వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాదరావు తెలిపారు. మానవసేవా ట్రస్ట్ తరఫున వైద్యులు లీల దిగుమర్తి, రఘునాథరావుల పర్యవేక్షణలో వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు టి.అప్పారావు, ఉపాధ్యక్షుడు టి. వెంకటేశ్వరావు, సంస్థ జాయింట్ సెక్రటరీ పి. రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వేపతో కీటకాలు నాశనం..

- వేప ఉత్పత్తుల వినియోగంపై అన్నదాతల దృష్టి
- రసాయన ఎరువుల వినియోగంతో భూసారం శూన్యం
- వేప ఉత్పత్తులతో తక్కువ ఖర్చు.. అధిక దిగుబడులు
- దాదాపు 300 రకాల కీటకాలు నాశనం



వేప

భోగాపురం: వేపలో ఉండే అజాడిరాక్టిన్ పదార్థంతో సుమారు 300 రకాల కీటకాలు, నల్లజాతి పురుగులు, చెదలు, బూజు శిలీంద్రాలను అరికట్టవచ్చు. వరి, పత్తి, ఆపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యానవన పంటలను ఆశించే కీటకాలను వేప ఆరికడుతుంది. మార్కెట్‌లో వేప పిండి, వేపనూనె, వేప కాషాయం ఇలా వివిధ రకాల వేప ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

కీటకాల నివారణలో కీలకం

నీమ్ ఆయిల్‌ను స్థానిక వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు వినియోగిస్తే కీటకాలను నివారించవచ్చు. ఈ మందు పిచికారీ చేసినప్పుడు పురుగులకు వికారం కలిగించి పైరును నాశనం చేయకుండా చేస్తుంది. విషపూరిత అవశేషాలు ఉండవు. ఇది పక్షులు, మానవులు, మిత్ర పురుగులు, తేనెటీగలు వంటి జీవరాశులకు హాని చేయవు. సమగ్ర సస్యరక్షణ విధానంలో వేప మందులు బాగా ఉపయుక్తమవుతాయి. పురుగు మందులు, శిలీంద్ర నాశినులతో వేపను కలిపి సురక్షితంగా పిచికారీ చేసుకోవచ్చు.

పిచికారీకి సానుకూల సమయం

పైరుపై పురుగు ఆశించిన వెంటనే వేప నూనె పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే పిచికారీ చేస్తే ఇంకా మంచిది. 3 నుంచి 5 మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి ఎకరాకు 20 లీటర్లు పిచికారీ చేయాలి. వాతావరణం చల్లగా ఉన్న సమయాల్లో (ఉదయం లేక సాయంత్రం) పిచికారీ చేసుకోవడం మంచిది.7 నుంచి 15 రోజుల వ్యవధిలో వర్షం పడితే మళ్లీ పిచికారీ చేయాల్సిందే.

తెగుళ్ల నివారణ

వివిధ పంటల్లో వేప ఉత్పత్తులు వాడకంతో పలు రకాల చీడపీడలను నివారించవచ్చు. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేపపిండిని దమ్ములో వేయడం ద్వారా కాండం తొలిచే పురుగు, ఉల్లికోడును అదుపు చేయవచ్చు. వరి పైరుకు లీటరు నీటిలో 3 మిల్లీ లీటర్ల వేప నూనె కలిపి ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేస్తే అగ్గితెగులు, తొడిమికుళ్లు, పాడ తెగులును అదుపు చేయవచ్చు. మిరప పంటకు 5 శాతం వేప గింజల కషాయాన్ని ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేస్తే తెల్లదోమ నివారించవచ్చు. వేరుశనగకు ఆశించి తిక్కాకుమచ్చ, టమాటకు ఆశించే ఎండు తెగులును వేప నూనెతో నివారించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఇంటిలోనే తయారీ..

పంటకు అవసరమైన వేప కాషాయాన్ని ఇంటిలో మహిళలే స్వయంగా తయారు చేసుకోవచ్చు. 5 కిలోల వేప గింజలను నలగ్గొట్టి 6 నుంచి 7 లీటర్ల నీటిలో రెండు, మూడు రోజులు నానబెట్టాలి. దీన్ని వస్త్రంలో పోసి వడకట్టాలి. మరో 100 లీటర్ల నీటిని అందులో కలిపి వినియోగించాలి.

వేపతో మంచి ఫలితాలు..



వేప గింజల నుంచి నూనె తీస్తారు. నూనె తీయగా వచ్చే వేప చెక్క ఎండిన వేపకాయలను దంచగా వేపపిండి తయారవుతుంది. ఈ పిండిని ఎక్కువగా వరి పంట, నిమ్మ తోటలకు వాడవచ్చు. ఎటువంటి పంటలకైనా వేప ఉత్పత్తులను వాడితే మంచి ఫలితాలు వస్తాయి. – వి. హరికృష్ణ, మండల వ్యవసాయశాఖ అధికారి, భోగాపురం

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

- ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి



మొక్క నాటుతున్న పీడీ శాంతకుమారి

విజయనగరం ఫోర్ట్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఐసీడీఎస్ పీడీ బి. శాంతకుమారి పిలుపునిచ్చారు. మండలంలోని బడ్డుకొండపేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి..

విజయనగరం ఫోర్ట్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. అనురాధ తెలిపారు. స్థానిక అయ్యన్నపేట, బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. పచ్చదనం పెంచడం వల్ల ఆరోగ్యకర సమాజం నెలకొంటుందన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



ముంజేరులో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి వైవీ రమణ

భోగాపురం: వర్షాకాలంలో పశువుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి వైవీ రమణ పాడి రైతులకు సూచించారు. మండలంలోని ముంజేరు, గాబువానిపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల క్యాంపులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున పాడి రైతులకు అందుబాటులో ఉండాలని పశువైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త సహాయ సంచాలకుడు వేణుమాధవ్, పశువైద్యాధికారి యు. రామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భూమి మంజూరు చేయాలంటూ వినతి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రెల్లివలస గ్రామస్తులు

పూసపాటిరేగ : తమకు భూమి మంజూరు చేయాలని రెల్లివలసకు చెందిన పలువురు దళితులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ తాడ్డి గోవిందను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ, రెల్లివలస సర్వేనంబర్ 1లో ఉన్న భూమిని తమకు కేటాయించాలని కోరారు. దీనికి తహసీల్దార్ స్పందిస్తూ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఎద్దు సుజాత, అలమండ చిన్న, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని గొల్లపేటకు చెందిన బమ్మిడి ఆనందరావు ఇటీవల అచ్యుతాపురం ఎసెన్సియా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పరామర్శలో ఆమెతో పాటు ప్రజాప్రతినిధులు మహంతి శివ, పతివాడ శ్రీనివాసరావు, బాలా అప్పలరాజు, జమరాజు, జలపార శివ, శంకాబత్తుల సత్తిబాబు, పీడీపీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంతాల్లో తహసీల్దార్ పర్యటన



ముక్కాం సముద్రతీర ప్రాంతంలో పర్యటిస్తున్న తహసీల్దార్ సురేష్, తదితరులు

భోగాపురం: మండల పరిధిలోని ముక్కాం, చేపలకంచేరు, కొండ్రాజుపాలెం సముద్రతీర ప్రాంతాల్లో తహసీల్దార్ ఎం. సురేష్ శనివారం పర్యటించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల మూడు రోజుల పాటు సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందన్నారు. ప్రతికూల వాతావరణం దృష్ట్యా వేటకు వెళ్లవద్దని మత్స్యకారులను హెచ్చరించారు. పర్యటనలో ఆయన వెంట వీఆర్వో లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు గనగళ్ల బాబాజీ, మత్స్యకారులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విజయనగరం టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నగరంలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు నగర పాలక సంస్థ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ కార్యాలయంలో 24 గంటలూ పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేసినట్లు కమిషనర్ పి.నల్లనయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సమయంలో కంట్రోల్ రూమ్ నంబర్‌కు 98499 06486 సమాచారం అందించాలని సూచించారు.

సత్కారం..

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను శనివారం ఘనంగా సత్కరించారు. బెటాలియన్‌లోని యూనియన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైలు వై.కాటరాజు, యు.రాంబాబులను సత్కరించి, వారు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషనల్ కమాండెంట్ జీవీ ప్రభాకరరావు, అసిస్టెంట్ కమాండెంట్లు జి. లక్ష్మీనారాయణ, డీవీ రమణమూర్తి, ఎస్.బాలాజీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై ధ్వజమెత్తారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు నగర పంచాయతీలో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక పీహెచ్‌సీలోని సమస్యలు, గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్లు, నిబంధనలకు విరుద్ధంగా వెలసిన భవనాలు, తదితర సమస్యలపై చర్చించారు. అలాగే కార్మికులకు అన్యాయం చేయడంతో పాటు నగర పంచాయతీకి పన్నులు చెల్లించని జూట్‌మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి స్పందిస్తూ, తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కమిషనర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి



లోగోను ఆవిష్కరిస్తున్న ఆహ్వాన సంఘ ప్రతినిధులు

విజయనగరం పూల్‌బాగ్: ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షుడు పి. కామేశ్వరరావు పిలుపునిచ్చారు. నవంబర్ 27 నుంచి 30 వరకు విజయనగరంలో మహాసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మహాసభలకు సంబంధించిన లోగోను ఆహ్వానసంఘ గౌరవాధ్యక్షుడు పి. అశోక్‌గజపతిరాజు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డి.జగదీష్, కిమిడి నాగార్జున, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, ఇబ్రహీం, ఏఐఎస్ఎఫ్ నాయకులు జి. ఫణీంద్ర, ఎస్. నాగభూషణం, బి. బాబ్జీ, పి. గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ నగర పర్యటన



కొత్తపేట నీళ్ల ట్యాంక్ వద్ద నీటి పంపిణీ విధానాన్ని పరిశీలిస్తున్న నగరపాలక కమిషనర్ నల్లనయ్య

విజయనగరం టౌన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కొత్తపేటలో ఉన్న డాగ్స్ షెల్టర్స్‌ను పరిశీలించారు. ఆ తర్వాత కొత్తపేట నీళ్ల ట్యాంక్ వద్దకు చేరుకుని నీటి పంపిణీ విధానంపై ఆరా తీశారు. వాటర్ ట్యాంక్ ప్రధాన ద్వారం వద్ద కాలువ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వైఎస్సార్ నగర్‌కు వెళ్లే మార్గంలో రైల్వే బ్రిడ్జి పక్కన కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అల్ హజరత్ ఉత్సవాలు..



ర్యాలీలో పాల్గొన్న ముస్లిం సోదరులు

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలో ముస్లిం సోదరులు అల్ హజరత్ ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. సున్నీ మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. ఆబాద్‌వీధిలో ఉన్న ఉర్దూ మదరసా అల్ జామియాతుల్ హబీబియా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో ముస్లింల ప్రతినిధులు మహమ్మద్ గౌస్, ఎం.డి.సలామ్, ఎస్.కె.మస్తాన్, మొహమ్మద్, బహర్, సయ్యద్ ఆరీఫ్ ఖాన్, షేక్ అన్వర్, ఎం.డి షఫీ, షేక్ రహీమ్, ఎస్‌కే మౌలానా, హఫీజ్, తదితరులు పాల్గొన్నారు.

సత్య కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ



క్యాడెట్లను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, తదితరులు

విజయనగరం అర్బన్: సికింద్రాబాద్ భువనపల్లిలో ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆంధ్ర, తెలంగాణా ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌లో పట్టణంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్‌సీసీ క్యాడేట్స్ పాల్గొన్నారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి తెలిపారు. క్యాంప్‌లో పాల్గొని ప్రతిభ చూపిన ఈ.భాస్కర్, ఆర్.చరణ్‌తేజ, జి.కార్తీక్‌లను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపునాయుడు, కళాశాల యాజమాన్యం శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



నెల్లిమర్ల రూరల్: మొయిదలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, ఎమ్మెల్సీ సురేష్‌బాబు



నెల్లిమర్ల రూరల్: కొండవెలగాడలో పింఛన్ అందజేస్తున్న ఆర్టీసీ మాజీ జోనల్ చైర్‌పర్సన్ బంగారమ్మ



విజయనగరం టౌన్: పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న నగరపాలక కమిషనర్ నల్లనయ్య

భోగాపురం: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. మండలంలోని ముక్కాం పంచాయతీలో శనివారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి పాల్గొని పలువురు లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కర్రోతు సత్యనారాయణ, వరుపుల సుధాకర్, గుండపు సూరిబాబు, మైలపిల్లి అప్పలకొండ, పల్ల రాంబాబు, గనగళ్ల బాబాజీ, రాము, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఈఓపీఆర్డీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మొయిదలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద విజయరామపురం గ్రామంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు పింఛన్లు పంపిణీ చేశారు. పలువురు లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాల, ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్ బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు ఘనత గత ప్రభుత్వానిదే..

నెల్లిమర్ల రూరల్: సామాజిక పింఛన్ల పెంపు ఘనత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఆర్టీసీ మాజీ జోనల్ చైర్‌పర్సన్, సర్పంచ్ గదల బంగారమ్మ అన్నారు. మండలంలోని కొండవెలగాడలో పలువురు లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధులు, దివ్యాంగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా ఇళ్లకే పింఛన్ల సొమ్ము అందించే విధానాన్ని అమల్లోకి తెచ్చారన్నారు.

పింఛన్ పంపిణీ పరిశీలన

విజయనగరం టౌన్: నగరంలో చేపట్టిన పింఛన్ల పంపిణీని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ, ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయానికల్లా పింఛన్లు అందిస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు. సాయంత్రం ఐదుగంటల కల్లా 96.85 శాతం పంపిణీ పూర్తయిందని చెప్పారు. 23,155 మంది పింఛన్ దారులకు గాను 22,425 మందికి నగదు అందజేసినట్లు చెప్పారు.

బాలికల ఆరోగ్యంపై ఆరా..

విజయనగరం అర్బన్: డుంబ్రిగూడ మండలం జామిగూడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం జరిగిన ఫుడ్ పాయిజన్ వల్ల పలువురు విద్యార్థినులు అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఆ జిల్లా అధికారులు, వైద్యులతో శనివారం ఫోన్‌లో మాట్లాడి బాలికల ఆరోగ్యంపై ఆరా తీశారు.